
# సాక్షి ములుగు

బుధవారం | 13 | సెప్టెంబర్ | 2023



**ఉత్సవం.. ఉత్సాహం..**

కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా జాతీయ సమైఖ్యతకు ప్రతీకగా నిలుస్తోంది. 386 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దర్గా.. మతాలక తీతంగా పవిత్ర స్థలిగా విరాజిల్లుతోంది.

- 8లో▸



**మెరుగైన వైద్యసేవలందించాలి**

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0⁰ /25.0⁰

**వాతావరణం**

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### తాళాలు పగులగొట్టి పోషకాహారం పంపిణీ



**ఎస్ఎస్ తాడ్వాయి:** మండల పరిధిలోని వెంగళాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి వేసిన తాళాలను పగులగొట్టి బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోషకాహారం మంగళవారం అందజేశారు. రెండు రోజుల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించాలని సూపర్‌వైజర్లను ఉన్నతాధికారులు ఆదేశించడంతో అత్యవసర పరిస్థితుల్లో తాళాలు పగులగొట్టి పోషకాహారం అందించారు.

### బోనస్ ఇప్పించేందుకు కృషి



**ఏటూరునాగారం:** అర్హులైన తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు ఇప్పించేందుకు కృషి చేస్తానని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మణ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో తునికాకు కూలీలతో ఆయన మంగళవారం మాట్లాడారు. ఇటీవల తునికాకు బోనస్ డబ్బులు అర్హులు కాని ఇతరుల ఖాతాల్లో జమ అయినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారుతో మాట్లాడి అర్హులైన ప్రతి ఒక్కరికీ బోనస్ డబ్బులు వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ సంవత్సరం వర్షాకాలం ఎస్సీ కాలనీల్లోని ప్రజలు ఇబ్బందులు పడతున్నారని తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చేపడుతానని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీలో చేరిన ప్రహ్లాద్

**ములుగు:** అనుకున్నట్లుగానే దివంగత మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ తనయుడు డాక్టర్ ప్రహ్లాద్ మంగళవారం బీజేపీలో చేరారు. తన అనుచరులు, బీజేపీ ముఖ్యనేతలతో 150 వాహనాల్లో సుమారు 1500 మందితో హైదరాబాద్ తరలివెళ్లారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన మాజీ ఎంపీ, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు సమక్షంలో హుజురాబాద్ ఎమ్మెల్యే, పార్టీ చేరికల కమిటీ, ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. ఇప్పటికే ప్రహ్లాద్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ తరలివెళ్లిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజ్మీరా కృష్ణవేణి నాయక్, పార్లమెంట్ కో కన్వీనర్ తక్కెళ్లపల్లి దేవేందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు నగరపు రమేష్, గాజుల కృష్ణ, నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, ఉపాధ్యక్షుడు మండల విజయ్‌కుమార్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సాంబశివరెడ్డి, రవీంద్రచారి, వాసు దేవ రెడ్డి, చిన్న కొండారెడ్డి, రాకేష్ యాదవ్, తేజరాజు, బాణాల రాజు, కొత్త సురేందర్ తదితరులు ఉన్నారు.

### మెడికల్ కళాశాలను పరిశీలించిన డీఎంఈ

**భూపాలపల్లి అర్బన్:** జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంగళవారం వైద్యారోగ్యశాఖ డీఎంఈ రమేష్‌రెడ్డి పరిశీలించారు. ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా 9 మెడికల్ కళాశాలలను సీఎం కేసీఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలో కళాశాల భవనం, జిల్లా జనరల్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సరైన వైద్య సేవలు సకాలంలో అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజుడేవిడే, సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

### కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా ఇవ్వాలి

**భూపాలపల్లి అర్బన్:** సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా 35శాతం ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాశుద్దీన్ డిమాండ్ చేశారు. ఏరియాలోని ఓపెన్‌కాస్ట్‌ల ఎస్‌వీఈసీ ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థలో 40వేల మంది పర్మనెంటు ఉద్యోగులతో పాటు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నట్లు తెలిపారు.

# బదిలీల్లో టీచర్ల పక్కదారులు!

**ప్రాధాన్యత కోసం కొందరు 'దివ్యాంగులు' అవుతున్న వైనం**

- అర్హత లేని మెడికల్ బోర్డుల నుంచి ధ్రువీకరణ పత్రాలు
- రూ.25 వేల నుంచి రూ.30 వేలకు కొనుగోలు
- తప్పుడు పత్రాలపై చర్యలకు ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- డీఈఓ కార్యాలయాల్లో చక్రం తిప్పుతున్న స్క్రూటినీ అధికారులు



**జిల్లాల వారీగా పోస్టుల మంజూరు.. ఖాళీల వివరాలు..**

| జిల్లా | మంజూరు | పనిచేస్తున్నది | ఖాళీలు |
|---|---|---|---|
| హనుమకొండ | 2,693 | 2,381 | 312 |
| వరంగల్ | 2,991 | 2,573 | 418 |
| మహబూబాబాద్ | 3,623 | 3,107 | 516 |
| జనగామ | 2,557 | 2,161 | 396 |
| జేఎస్ భూపాలపల్లి | 1,804 | 1,395 | 409 |
| ములుగు | 1,395 | 1,093 | 302 |

సాక్షిప్రతినిధి, వరంగల్:

- హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు తనకు వినికిడి లోపం ఉన్నట్లుగా సర్టిఫికెట్‌ను దాఖలు చేశారు. ఇదే మండలంలోని మరో గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయురాలు నరాల సమస్య (న్యూరో ప్రాబ్లం) ఉందని పేర్కొనడంపై చర్చ జరుగుతోంది.
- ములుగు జిల్లాలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయుడు కోరుకున్న చోటకు వెళ్లడంతోపాటు పదోన్నతుల్లో ప్రాధాన్యత కోసం మానసిక వికలాంగులైన పిల్లలు ఉన్నట్లు సర్టిఫికెట్ సమర్పించారు. ఇదే జిల్లాలో మరో ఉపాధ్యాయుడు తాను క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు.

... ఇలా వరంగల్, జనగామ, మహబూబాబాద్, జేఎస్ భూపాలపల్లి జిల్లాలనుంచి మరో ఇరవై మంది వినికిడి లోపం, క్యాన్సర్, మానసిక వికలాంగ పిల్లలు, దీర్ఘకాలిక జబ్బులు ఉన్నట్లు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రాథమికంగా వెల్లడైనట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో నకిలీ మెడికల్ సర్టిఫికెట్ల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి వరంగల్‌లో పలువురు ఇప్పటికే బదిలీల్లో ప్రాధాన్యత, కోరుకున్న చోట పోస్టింగ్ దక్కించుకోవడం కోసం 'దివ్యాంగుల' సర్టిఫికెట్లు సమర్పించారన్న ప్రచా రం జరుగుతోంది. ఎనిమిది నెలల అనంతరం కోర్టు స్టే ఎత్తివేతతో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సాగుతోంది. ఈ సందర్భంగా ఎలాంటి పైరవీలు, అక్రమాలకు తావులేదని చెబుతున్నా.. అర్హత సాధించడం కోసం 'ఫేక్ మెడికల్ సర్టిఫికెట్లు' సమర్పించారన్న ప్రచారంపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు సైతం జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం కలకలం రేపుతోంది.

**మార్కెట్లో ఫేక్ సర్టిఫికెట్లు.. రూ.10 వేల నుంచి రూ.50 వేలు..**

2018లో జరిగిన పదోన్నతులు, బదిలీల సందర్భంగా భారీగా నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించిన బాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. దీర్ఘకాలిక జబ్బులున్నాయంటూ 2వేల మంది తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు రాష్ట్రవ్యాప్తంగా అధికారులు గుర్తించారు. ఒక్కో సర్టిఫికెట్ కోసం రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వెచ్చించినట్లు తేల్చారు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, కరీంనగర్‌లతో పాటు వరంగల్‌లో ఈ తరహా అక్రమాలు వెలుగు చూశాయి. జేఎస్ భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 52 మంది వరకు ఈ తరహా లబ్ధి పొందినట్లు గుర్తించామని అప్పట్లో అధికారులు ప్రకటించారు. ఈ సర్టిఫికెట్లు జారీ చేసిన వారిపైనగానీ, తీసుకున్న చాలా మందిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈసారి కూడా కొందరు ఉపాధ్యాయులు తోటి ఉపాధ్యాయుల న్యాయమైన అర్హతలను దెబ్బతీసి అందలం ఎక్కేందుకు మళ్లీ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించినట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్‌లో ఈసారి కూడా చాలా మంది మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించగా.. హనుమకొండ, వరంగల్, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లో 24మంది ఫేక్ సర్టిఫికెట్లు సమర్పించినట్లు ఉపాధ్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది. వీటిపై విచారణ జరపాలని ఉపాధ్యాయ సంఘాలు డీఈఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించాయి. అయితే డీఈఓ కార్యాలయాల్లో పనిచేసే కొందరు స్క్రూటినీ అధికారులు అన్నీ తాము చూసుకుంటామని చక్రం తిప్పుతున్నట్లు ప్రచారం.

**వేగంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ..**

విద్యాశాఖ అధికారులు బదిలీల ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ నెల 8, 9 తేదీల్లో ప్రాథమిక సీనియారిటీ జాబితాను విడుదల చేసి అభ్యంతరాలను స్వీకరించిన అధికారులు తుది సీనియారిటీ జాబితాను బుధవారం ప్రకటించనున్నారు.

**పారదర్శకంగా బదిలీల ప్రక్రియ జరగాలి**



బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాలి. అర్హులైన ఉపాధ్యాయులకు నష్టం కలగకుండా నకిలీ సర్టిఫికెట్లపై జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రత్యేక కేటగిరి కింద వికలాంగుల సర్టిఫికెట్లను డాక్టర్ల బృందంతో పరిశీలించాలి. ఈ విషయమై ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించాం. అనర్హులకు పట్టం కడితే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతాం.

**- రావుల్‌కార్ వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు, పీఆర్టీయూ, హనుమకొండ**

**ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి**



ఉపాధ్యాయుల బదిలీల విషయంలో అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి. వికలాంగుల కోటాలో వచ్చిన అభ్యర్థనలపై వైద్య నిపుణుల సమక్షంలో సర్టిఫికెట్లను పరిశీలించాలి. వినికిడి లోపానికి సంబంధించి హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఈఎన్‌టీ సదరం సర్టిఫికెట్లనే పరిగణనలోకి తీసుకోవాలి.

**- బత్తిని రవీందర్‌గౌడ్, టీటీయూ ప్రతినిధి, హనుమకొండ**

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ పాణిని

**ములుగు:** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని డీఈఓ పాణిని సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సైన్స్ సెమినార్‌కు డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హేతుబద్ధీకరణ, శాస్త్రీయ ఆలోచనల ద్వారా నిజ జీవితంలో విద్యార్థులు రాణించగలుగుతారని తెలిపారు. విద్యార్థుల్లో నూతన ఆలోచనలు రేకెత్తించడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి జయదేవ్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించనున్న సైన్స్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. సైన్స్ డ్రామా ఫెస్టివల్, సైన్స్ ఫెయిర్‌లకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. సెమినార్‌కు కిరణ్‌కుమార్, ఇందిరాదేవిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతగా నిలిచిన మంగపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి అక్షర ఈ నెల 19వ తేదీన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సెమినార్‌లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీఈబీ కార్యకర్శి విజయమ్మ, క్వాలిటీ కో ఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి**



నాగజ్యోతికి స్వాగతం పలుకుతున్న మహిళలు

**మంగపేట:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి అన్నారు. మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహ స్వామిని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ బాబుతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునరుద్ధరణ కమిటీ అధ్యక్షుడు నూతుల కంటి ముకుందం పార్టీ శ్రేణులతో ఘనంగా స్వాగతం పలికారు. మల్లూరు బీసీ కాలనీలోని స్వామివారి ఆర్చీ వద్ద మహిళలు మొట్టమొదటి సారిగా వచ్చిన నాగజ్యోతికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముందుగా కమలాపురం ఆంజనేయస్వామి ఆలయం నుంచి మల్లూరు వరకు ద్విచక్ర వాహనాలు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హేమాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట పార్టీ జిల్లా నాయకులు చిట్టిమళ్ల సమ్మయ్య, ఏటూరు నాగారం ఎంపీపీ విజయ, రామప్ప పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆకిరెడ్డి రాంమోహన్‌రావు, మంగపేట ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ తోట రమేష్, వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులరైజ్ చేసే వరకూ దీక్ష కొనసాగించాలి



మాట్లాడుతున్న సహదేవ్

**ములుగు:** రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులను గుర్తించి రెగ్యులరైజ్ చేసేంత వరకూ రిలే దీక్షలను కొనసాగించాలని సమగ్రశిక్ష ఉద్యోగ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేగుల సహదేవ్, రాష్ట్ర కార్యదర్శి జానకీరాం, సీఆర్పీ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన కార్యక్రమాలు వినూత్నంగా ఉన్నాయని, అందరూ కలిసి కట్టుగా ఉంటూ నిరసన దీక్షలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. రాబోయే కాలంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సూచించారు. తొమ్మిది రోజులుగా ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. కేజీబీవీ ఉద్యోగులతో పాటు అన్ని శాఖల ఉద్యోగులు దీక్షలకు హాజరు కావాలని కోరారు. ఈ నిరసన దీక్షలకు పలు సంఘాల అధ్యక్షులు, కన్వీనర్‌లు మద్దతుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చల్లా భాస్కర్‌రెడ్డి, సోమిడి కర్ణాకర్, విష్ణు, కుమార్‌పాడియ, చిరంజీవి, భిక్షపతి, రమేష్, రాజేశ్వరి, అనిత, తిరుమల, స్వాతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

**ములుగు రూరల్:** అంగన్ వాడీ సెంటర్ల తాళాలు పగుల కొట్టినందుకు నిరసనగా కలెక్టరేట్ ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ అంగన్ వాడీ టీచర్లకు కనీస వేతనం అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ. 10 లక్షలు, ఆయాలకు 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గాంధీ విగ్రహం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మె నేటితో రెండో రోజుకు చేరుకుంది. అంగన్ వాడీలు చట్ట ప్రకారం శాంతియుతంగా సమ్మె చేస్తుంటే జిల్లా అధికారులు తాడ్వాయి, ఏటూరునాగారం, వెంకటాపురం ప్రాజెక్టులోని సుమారు 50 అంగన్ వాడీ సెంటర్ల తాళాలు బలవంతంగా, దౌర్జన్యంగా పగుల కొట్టి సెంటర్లను ఓపెన్ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో గుండెబోయిన రవిగౌడ్, అంగన్ వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు సరోజ, ఉపాధ్యక్షులు రాణి, పద్మరాణి, భాగ్యలక్ష్మీ, పద్మావతి, విజయ, కల్పన, రాధిక, మానస, బాణమ్మ, స్వరూప, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత చేపపిల్లల పంపిణీ



చేపపిల్లలు పంపిణీ చేస్తున్న శ్రీపతి

**ఏటూరునాగారం:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి ఆధ్వర్యంలో మంగళవారం మత్స్య కారులకు ఉచిత చేపపిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య సహకార సొసైటీ పరిధిలోని చెరువులు, కుంటల్లో 100 శాతం సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని ఆకులవారి ఘణపురం, ఏటూరునాగారం, అల్లంవారి ఘణపురం, చెల్పాక, కొండాయి, దొడ్ల, రోహీర్, బూటారం, రాంపూర్, అగ్రహార్, ఎక్కేల, శంకరాజుపల్లి, శివాపురం గ్రామాల్లోని మొత్తం 17 చెరువులకు గాను 5,10,600 చేపపిల్లలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ వలియాబీ, సలీం, ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ఏటూరునాగారం:** అర్హులందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేయాలని బహుజన సమాజ్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గద్దం భిక్షపతి గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ సంధ్యా రాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి స్థలం ఉండి ఇల్లు లేని అర్హులకు గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు ఇవ్వాలన్నారు. లేకుంటే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో ఆందోళను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శనిగరపు నరేష్ కుమార్, మండల అధ్యక్షుడు ఏంపెల్లి రాజు, వీరస్వామి, పడిదల ప్రభు, వావిలాల కిషోర్, దేపాక సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రుణాల మంజూరులో వేగం పెంచాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



అధికారులు, బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ములుగు:** రైతులకు రుణాల మంజూరులో వేగం పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్ష సమావేశాన్ని బ్యాంకర్లు, అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2018లో 25,091 మంది రైతులకు రూ.124.44 కోట్లను రైతులకు అందించామని తెలిపారు. అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేసి రెన్యూవల్ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు రూ.లక్షలోపు రుణం తీసుకున్న వారిని గుర్తించి మాఫీ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెమిటెడ్, ఎలిజిబిలిటీ లిస్టులను బ్యాంకర్లు వేరువేరుగా అధికారులకు అందించాలని సూచించారు. రుణమాఫీకి ప్రతీ బ్యాంకు నోడల్ అధికారిని నియమించుకోవాలని సూచించారు. సమస్యలు పరిష్కంచేందుకు వ్యవసాయ శాఖ కార్యాలయంలో కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. రెన్యూవల్ చేసిన అనంతరం వారికి తిరిగి రుణాలను అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు సమన్వయంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం రాజ్‌కుమార్, ఎస్బీఐ వరంగల్ రూరల్ చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీఏఓ గౌస్ హైదర్, ఆర్బీఐ ఎల్డీఎం అలిబాబా, ఏటూరునాగారం ఏపీఓ వసంతరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, మత్స్య శాఖ అధికారి శ్రీపతి, పశు సంవర్ధక శాఖ అధికారి విజయభాస్కర్, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి**

**మంగపేట:** మహిళలు ఆరోగ్యంపై అశ్రద్ధ చూపకుండా ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మహిళా ఆరోగ్య క్లీనిక్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలతో వైద్య పరీక్షలు, సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి నరేష్, మండల ప్రత్యేకాధికారి తుల రవి, వైద్యాధికారి వైశాలి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన పూజలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న పండితులు

**కాళేశ్వరం:** కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయం శ్రీశుభానంద దేవి అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన పూజలు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవోపేతంగా ప్రారంభం చేశారు. మంగళవారం సాయంత్రం మంగళవాయిద్యాలతో గణపతి పూజకార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, దేవస్థానం చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు, సిద్ధాంతి భాపుప్రకాష్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**నేడు ప్రతిష్ఠాపన**

ఆలయంలో బుధవారం ఉదయం 10.11గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు, భూపాలపల్లి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్‌లు జక్కు శ్రీహర్షిణి, పుట్ట మధుకర్ హాజరుకానున్నారు.

## ఇంటి స్థలాలు ఇచ్చే వరకు పోరాటం



మండపాక వద్ద ప్రభుత్వ భూమిని చదును చేసేందుకు వచ్చిన పేదలు

**సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డి**

**వాజేడు:** పేద ప్రజలకు ఇంటి స్థలాలు దక్కే వరకు సీపీఎం పోరాడుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మండపాక గ్రామ సమీపంలో ఇంటి స్థలాల కోసం చెట్లు కొడుతున్న ప్రదేశానికి చేరుకున్న ఆయన వారితో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల్లోని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఒకే కుటుంబంలో మూడు నుంచి నాలుగు కుటుంబాల వారు ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి వరదలతో ఈ ప్రాంత ప్రజలు తరలివెళ్లడం ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసినా స్పందించకపోవడం దారుణమన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలను ఇవ్వకపోవడంతో సుమారుగా 30 గ్రామాల నుంచి 750 మంది వచ్చి ఇంటి స్థలాల కోసం తరలివచ్చి భూమి చదును చేసుకుంటున్నారంటే వారి బాధ వర్ణనాతీతమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి నిరుపేద ప్రజలకు ఇంటి స్థలాలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేడు గుడిసె వాసుల పోరాట కేంద్రాన్ని పార్టీ రాష్ట్ర కన్వీనర్ వీరయ్య సందర్శించనున్నట్లు తెలిపారు. మండపాక సమీపంలోని ప్రభుత్వ భూమిలో రెండోరోజూ నిరుపేద ప్రజలు చెట్లను కొట్టి భూమిని చదును చేసుకుని గుడిసెలను వేశారు. వెంకటరెడ్డి వెంట రఘుపతి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## క్లుప్తంగా

### ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల రాష్ట్ర కమిటీ ఎన్నిక



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మంచిర్యాల డిపోనకు చెందిన రెంక రవి, జనరల్ సెక్రటరీగా వంగ రాజు (వరంగల్ డిపో), కోశాధికారిగా రాజునాయక్ (సిరిసిల్ల), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దేవేందర్ రెడ్డి (కోదాడ), రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా శ్రావణ్‌కుమార్ (మహబూబాబాద్), ప్రచార కార్యదర్శిగా బూడిద నరేష్ (యాదగిరిగుట్ట) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదగిరిగుట్ట డిపో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు బూడిద నరేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర యూనియన్‌ను ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు.

### విద్యుదాఘాతంతో యువతి మృతి


సౌందర్య(ఫైల్)

కొత్తగూడ: విద్యుదాఘాతంతో ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం మండలంలోని జంగవానిగూడెంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పుల్సం సౌందర్య(22) ఇంట్లో ఉన్న టేబుల్ ఫ్యాన్ సరి చేసేందుకు యత్నించగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

### వృద్ధురాలిని నమ్మించి ఆభరణాలు దోపిడీ

తిరుమలాయపాలెం: ఓ వృద్ధురాలిని నమ్మించి మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లి ఆభరణాల దోపిడీ చేసిన ఘటనపై కేసు నమోదైంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన బానోతు సరోజనను అదే గ్రామానికి చెందిన బర్మావత్ రవి ఈనెల 10న నమ్మించి మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం సుబ్లేడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న గుట్టల ప్రాంతానికి తీసుకొచ్చాడు. అక్కడ ఆమెపై దాడి చేసి మెడలోని సుమారు రూ.1.20 లక్షల విలువైన బంగారు గొలుసు, ఉంగరం ఎత్తుకెళ్లాడు. ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయగా మంగళవారం ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి ఘటనా స్థలిని పరిశీలించి నిందితుడు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వరాల శ్రీనివాస్ తెలిపారు.



# ఉత్సవం.. ఉత్సాహం..


సమావేశంలో మాట్లాడుతున్న దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా. చిత్రంలో మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, ఏసీపీ డేవిడ్‌రాజ్

**నేటి నుంచి కాజీపేట దర్గా ఉత్సవాలు ప్రారంభం..**
- మూడురోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి : మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా
- మత సామరస్యానికి ప్రతీక.. బియాబానీ దర్గా

కాజీపేట రూరల్: నగరంలోని కాజీపేట హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలుస్తోంది. 386 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దర్గా.. మతాలకతీతంగా పవిత్ర స్థలిగా విరాజిల్లుతోంది. ఇస్లాం సంప్రదాయ ప్రకారం మహాపురుషులకు చెందిన దర్గాలకు మాత్రమే ఆకుపచ్చ రంగు వేస్తారు. ప్రపంచంలో 3 దర్గాలు ఆకుపచ్చ రంగు కలిగి ఉన్నాయని అవి మదీనా, బాగ్దాద్, కాజీపేట దర్గా అని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. అందుకే ఈ దర్గా ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తారు. ఆరు తరాల నుంచి దర్గా ఉత్సవాలు జరుగుతున్నాయని పీఠాధిపతి ఖుస్రూపాషా తెలిపారు.

**తీన్ దిన్ ఉర్సు ఉత్సవాల హైలెట్స్..**

దర్గా ఉత్సవాల్లో మొదటి రోజు బుధవారం అర్ధరాత్రి సందల్ ఉంటుంది. పీఠాధిపతి ఖుస్రుపాషా బడే ఘర్ నుంచి వెండి గిన్నెలో చందనం, పట్టువస్త్రాలను ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చి బియాబానీ సమాధిని శుభ్రం చేస్తారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలలు సమర్పించి అధికారికంగా ఉర్సు ఉత్సవాలు ప్రకటిస్తారు. రెండో రోజు ఈనెల 14వ తేదీన ఉర్సు ఉత్సవాలు జరుగుతాయి. మూడో రోజు ఈ నెల 15వ తేదీతో బదావాతో ఉత్సవాలు ముగుస్తాయి.

**భక్తులకు వసతి, భోజన సౌకర్యం..**

దేశ, విదేశాల నుంచి దర్గాకు తరలివచ్చే భక్తుల కోసం పీఠాధిపతి ఖుస్రూపాషా, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. అలాగే, శానిటేషన్, మంచినీటి సౌకర్యం, పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు దర్గా లోపల వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు పీఠాధిపతి ఖుస్రూపాషా తెలిపారు.

**ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి..**

కాజీపేట దర్గా ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా అన్నారు. ఈమేరకు మంగళవారం దర్గా ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్‌బాషా, కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ మాట్లాడారు. భక్తులకు సౌకర్యాలతోపాటు వాహనాల వన్‌వే, భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్, తహసీల్దార్ బావూ సింగ్, అసిస్టెంట్ కమిషనర్ రషీద్, భక్తియార్ బియాబానీ, కాజీపేట సీఐ సార్ల రాజు, మసూద్, మన్సూర్ బియాబానీ, షానావాజ్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్యసేవలందించాలి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- పాలకుర్తిలో మహిళా ఆరోగ్య క్లినిక్ ప్రారంభం


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశించారు. పాలకుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య క్లినిక్‌ను మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ జిల్లాలో మొదటి విడతలో రెండు మహిళా ఆరోగ్య కేంద్రాలు (స్టేషన్ ఘన్‌పూర్, ఇప్పగూడెం) ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 2,564 మందికి పరీక్షలు నిర్వహించి 251 మందిని జిల్లా కేంద్రానికి రెఫర్ చేసినట్లు తెలిపారు. రెండో విడతలో జిల్లాలో 5 మహిళా ఆరోగ్య కేంద్రాలకు అనుమతి లభించగా మంగళవారం పాలకుర్తిలో ప్రారంభించినట్లు తెలిపారు. మహిళా ఆరోగ్యానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కాగా, పలువురు ఆశ వర్కర్లు తమను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుహాసిని, జిల్లా వైద్యాధికారి ప్రశాంతి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, డాక్టర్ జ్యోతి, రవి రాథోడ్, ఎంపీటీసీ పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగాలు కల్పిస్తానని మోసం..

- రైల్వే ఉద్యోగి అరెస్ట్?

కాజీపేట: ఉద్యోగాలు కల్పిస్తానంటూ పలువురి నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేసి కుచ్చు టోపీ పెట్టిన రైల్వే ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం కాజీపేట ప్రాంతానికి చెందిన మాజీ రైల్వే కార్మిక సంఘం నాయకుడు తనకు పై స్థాయిలో ఉన్న సంబంధాలను ఆసరా చేసుకుని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానంటూ నిరుద్యోగ యువతను నమ్మించాడు. ప్రభుత్వ ఉద్యోగికావడంతో అనేక మంది నమ్మారు. అనంతరం వారి వద్ద నుంచి రూ. 40 లక్షల దాకా వసూలు చేసి ముఖం చాటేయడంతో అనుమానం వచ్చిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు అనంతరం సదురు ఉద్యోగిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

# బీజేపీని అధికారంలోకి తీసుకురావాలి

- పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి


మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి

హన్మకొండ: రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేయాలని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని విష్ణుప్రియ గార్డెన్‌లో బీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు, పార్టీ అనుబంధ మోర్చాల రాష్ట్ర పదాధికారులు, పార్టీ ప్రజాప్రతినిధులు, తదితరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో, అంతకుముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీజేపీ బలపడిందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 స్థానాల్లో విజయం సాధించాలన్నారు. ప్రజలు బీజేపీ పాలనను కోరుకుంటున్నారన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని చెప్పిన కేసీఆర్..అధికారంలోకి రాగానే హామీని విస్మరించారని విమర్శించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ సెప్టెంబర్‌లో వివిధ కార్యక్రమాలకు పిలుపునిచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, ఆరుట్ల దశమంత రెడ్డి, రామచందర్ రావు, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ వి.మురళీధర్ గౌడ్, నాయకులు మార్తినేని ధర్మారావు, జయపాల్, చాడ శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, ఏనుగుల రాకేష్ రెడ్డి, వన్నాల శ్రీరాములు, దేశిని సదానందం గౌడ్, ఆర్.పి.జయంత్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజుల్లో అభయహస్తం డబ్బు

- పావలా వడ్డీ కింద రూ. 3 వేల కోట్లు ఇచ్చాం
- పొదుపు సంఘాల పని తీరు బాగుంది
- రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా


మరియపురం జీపీ ఎదుట సందీప్‌కుమార్ సుల్తానీయా, కలెక్టర్, అదనపు కలెక్టర్

గీసుకొండ: కొంత కాలంగా మహిళా పొదుపు సంఘాలకు చెల్లించాల్సిన అభయహస్తం డబ్బును నెల రోజుల్లో విడుదల చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా అన్నారు. మహిళా సంఘాలకు ఇటీవల పావలా వడ్డీ కింద రూ. 300 కోట్లు ఇచ్చామని, శ్రీనిధి రుణాల వడ్డీని కూడా త్వరలో చెల్లిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని కొనాయమాకుల, మరియపురం గ్రామాలను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. మరియపురంలో పొదుపు సంఘాల పని తీరు బాగుందన్నారు. పొదుపులతో పాటు బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారన్నారు. భార్య మృతి చెందితే భర్తకు, భర్త మృతి చెందితే భార్యకు వెంటనే పింఛన్ మంజూరు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొనాయమాకులలో ఎస్‌హెచ్‌జీలతో పాటు వీవోల సభ్యులతో సమావేశమై సంఘాల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. శ్రీనిధి రుణాల ద్వారా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీ యూనిట్‌తో పాటు పలు వ్యాపార విభాగాలను పరిశీలించారు. మరియపురంలో మహిళా శిక్షణ కేంద్రం, జీపీ కార్యాలయం, పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. గతంలో గ్రామాభివృద్ధి గురించి గంగదేవిపల్లిని బ్రాండ్‌గా చెప్పేవారమని, ఇక నుంచి మరియపురం పేరు చెబుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, సెర్ప్ డైరెక్టర్ వైవీఎస్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకాడే, డీఆర్‌డీవో సంపత్‌రావు, అడిషనల్ ఏపీడీలు సాయిచరణ్, వసుమతి, డీపీవో పల్లవి, ఎంపీడీవో వీరేశం,ఎంపీపీ సౌజన్య, జెడ్పీటీసీ ధర్మారావు, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో సురేశ్‌కుమార్, సర్పంచ్‌లు అల్లం బాలిరెడ్డి, డోలె రాధ ఎంపీటీసీ వీరారావు, తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

- ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాక్, తెలంగాణ స్టేట్ కాంట్రాక్టు టీచర్స్ రాష్ట్ర జాక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన బాట పట్టాలని నిర్ణయించారు. మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆ రెండు సంఘాల జాక్ బాధ్యులు సమావేశమై కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాలల్లో మళ్లీ ఆందోళన బాటపట్టాలని నిర్ణయించినట్లు ఆ జాక్ చైర్మన్ కరుణాకర్‌రావు, కన్వీనర్ సాదురాజేష్, కో కన్వీనర్ బి వెంకటగోపీనాథ్ తెలిపారు. అన్ని యూనివర్సిటీ కళాశాలల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టబోతున్నామన్నారు. బైక్ ర్యాలీలు, పాదయాత్రలు, అన్ని కార్యక్రమాల అనంతరం ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే సమ్మె కూడా చేపట్టాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో12 యూనివర్సిటీల్లో 1445మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారని, వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘాల బాధ్యులు బైరి నిరంజన్, బొడిగె సతీష్, మాదాసి కనకయ్య, సూర్యనారాయణ, సునీత, భాగ్యలక్ష్మి, రమాదేవి, ప్రసాద్, సూర్యం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు డిప్యూటీ మేనేజర్ అరెస్ట్

- రూ. 8.65 కోట్లు వాడుకున్న అధికారి


కార్తీక్ అరెస్ట్ చూపిస్తున్న సీఐ రవి కుమార్

నర్సంపేట రూరల్ : బ్యాంకును మోసం చేసి రూ. 8.65 కోట్లు వాడుకున్న ఐసీఐసీఐ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ బైరిశెట్టి కార్తీక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం బైరిశెట్టి కార్తీక్.. నర్సంపేటలోని ఐసీఐసీఐ బ్యాంకులో గోల్డ్ లోన్ సెక్షన్‌లో ఐదు సంవత్సరాల నుంచి డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బ్యాంకులోని గోల్డ్‌లోన్ రెన్యూవల్, క్లోసింగ్ పూర్తిగా అతని ఆధీనంలోనే ఉంటుంది. దీంతో ఇదే అదునుగా భావించి రూ. 8.65 కోట్లు బ్యాంకు మోసం చేసి ఆ డబ్బును ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నారు. బంగారు రుణ ఖాతాలో క్లోజర్ నిమిత్తం ఖాతాదారులు డబ్బులు తీసుకుని బ్యాంకుకు రాగా ఆ డబ్బును తీసుకుని ఖాతాలో జమ చేయకుండానే పక్కకు పెట్టేవాడు. అనధికారికంగా రుణ ఖాతాను క్లోజ్ చేయకుండానే ఖాతాదారుడికి బంగారం అప్పగించేవాడు. అంతేకాకుండా ఎవరికీ అనుమానం కలగకుండా ఆ ఖాతాను రెన్యూవల్ అమౌంట్‌ను అతనే చెల్లించి ఖాతా నడుస్తున్నట్లు రికార్డుల్లో చూపించి ఆ డబ్బును తన సొంతానికి వాడుకునేవాడు. ఇలా 2019 నుంచి 2023 ఆగస్టు నెలవరకు మొత్తం రూ. 8.65 కోట్లు బ్యాంకును మోసం చేసినట్లు తెలిపారు. బ్యాంకును మాత్రమే మోసం చేశారని, ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నా రు. దీంతో బ్యాంకును మోసం చేసిన కార్తీక్‌ను నర్సంపేట బస్టాండ్ ఆవరణలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై శీలం రవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 'యూనివర్సిటీ' సినిమాను ఆదరించండి

- సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణమూర్తి


మాట్లాడుతున్న సినీ నటుడు ఆర్ నారాయణమూర్తి

హన్మకొండ చౌరస్తా : విద్యార్థులు, కాలేజీల్లో చదువు, ఉజ్వల భవిష్యత్ ఆధారంగా నిర్మించిన 'యూనివర్సిటీ' చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలని సినీ నటుడు, దర్శకుడు ఆర్ నారాయణమూర్తి అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం హనుమకొండకు వచ్చిన నారాయణమూర్తి, చిత్ర బృందంతో కలిసి బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల 13వ తేదీన 'యూనివర్సిటీ' సినిమా విడుదల కానుందని తెలిపారు. కష్టపడి చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగాలు రాక, తల్లిదండ్రులు అప్పు చేసి చదివిస్తున్న తీరును చిత్రంలో చూపించామన్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన పేపర్ లీకేజీలతో ఎన్నో ఏళ్లుగా కష్టపడి చదివిన విద్యార్థుల భవిష్యత్ అంధకారంగా మారిందన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని కార్పొరేట్లకు ధరాదత్తం చేస్తున్నాయని మండిపడ్డారు. సమావేశంలో కేయూ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌డీన్ రమేష్, విజయ్, తిరుణహరి శేషు తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ విద్య, వైద్యాన్ని పటిష్టం చేయాలి**

విద్యారణ్యపురి: ప్రభుత్వ విద్య, వైద్యాన్ని పటిష్టం చేయాలని సినీ దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ ధర్మేంద్ర, అధ్యాపకులతో కలిసి మాట్లాడారు. తాను నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'పై ప్రచారం నిర్వహించారు.

### నగరంలో యువకుడి హత్య..

- హనుమకొండ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఘటన


శివ మృతదేహం

వరంగల్ క్రైం: నగరంలోని హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగిన హత్య సంచలనం కలిగించింది. అశోకా జంక్షన్ పక్కనే ఉన్న యూనియన్ బ్యాంక్ ఆవరణలో రాయపురకు చెందిన యంజ్యాల శివ (33)పై అతడి స్నేహితుడు కర్రతో దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమకొండ సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. శివకు 10 సంవత్సరాల క్రితం వివాహమైంది. పెళ్లయిన రెండేళ్లకే భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. అప్పుడప్పుడు కూలి పనిచేసుకుంటూ పనిలేని సమయంలో రోడ్లపై ఖాళీ డబ్బాలు, ఇనుప సామాన్లు ఏరుకొని జీవనం సాగిస్తున్నాడు. అతనితో ఉండే భద్రాది కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రాళ్లగర్బ తండాకు చెందిన పాటియా రమేష్‌తో డబ్బుల విషయంలో గతంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా యూనియన్ బ్యాంక్ ఆవరణలో ఇద్దరు గొడవ పడ్డారు. ఆ గొడవలో రమేష్.. శివను కర్రతో బలంగా తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం సమాచారం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతుడితోపాటు నిందితుడి వివరాలు సేకరించారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, అర్ధరాత్రి 2 గంటల వరకు కూడా జనం ఉండే ప్రాంతంలో హత్య జరగడం సంచలనం కలిగించింది.

### సెమినార్‌తో ఆలోచన శక్తి

- జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్


మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్

మామునూరు: సైన్స్ సెమినార్లతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి మరింత పెరుగుతుందని వరంగల్ జిల్లా సైన్స్ సెంటర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం శ్రీనిధిశర్మ అధ్యక్షతన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి నేషనల్ సైన్స్ సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై సైన్స్ సెమినార్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు మిల్లెట్స్ అనే అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేయడం అభినందనీయమన్నారు. సైన్స్ పేపర్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థుల్లో క్రియేటివ్ పెరుగుతుందన్నారు. అనంతరం న్యాయ నిర్ణేతలుగా వీణ, వైజయంతి, కృష్ణారెడ్డి హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేశారు. వారికి సైన్స్ అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెమొంటోను అందించారు.

# విద్యార్థి జేఏసీ బంద్ ప్రశాంతం

- కేయూ క్రాస్ వద్ద టైర్ దహనం
- యథావిధిగా దీక్షల కొనసాగింపు


కేయూ క్రాస్ వద్ద టైర్ దహనం చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థి జేఏసీ నాయకులు

కేయూ క్యాంపస్: కేయూ పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవతవకలకు జరిగాయని ప్రశ్నించడంతో పోలీసులు అరెస్ట్ చేసి తీవ్రంగా కొట్టారని, దీనికి కారణమైన వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూ విద్యార్థి జేఏసీ మంగళవారం ఇచ్చిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం విద్యార్థి జేఏసీ నాయకులు కేయూ రెండోగేట్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహిస్తూ రాగా దూరవిద్యకేంద్రం క్రాస్ వద్ద ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన బస్సులను అడ్డుకున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థి జేఏసీ నాయకులకు నచ్చజెప్పి ఆయా బస్సులను వెనక్కి పంపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి.. విద్యార్థి జేఏసీ నాయకులకు సంఘీభావం తెలిపారు. పెట్రోల్‌పంపు ,హనుమకొండ చౌరస్తా, నక్కల గుట్ట, తదితర ప్రాంతాల్లో తిరుగుతూ బంద్‌ను పాటించాలని కోరారు. బైక్‌ర్యాలీ మధ్యాహ్నం వరకు కేయూ క్రాస్‌కు చేరుకుంది.అక్కడ టైర్ దహనం చేసి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుపతియాదవ్, బి నర్సింహారావు, వలీఉల్లా ఖాద్రీ, మేడ రంజిత్ కుమార్, విజయ్ కన్నా, నిమ్మల రాజేష్ ,రాజు నాయక్, మొగిలి వెంకట్ రెడ్డి ,పాషా ,అమర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, దూరవిద్యకేంద్రంలో ఆవరణలో మంగళవారం కూడా విద్యార్థి జేఏసీ దీక్షలు యథావిధిగా కొనసాగాయి. పోలీసుల దాడిలో గాయపడిన మాచర్ల రాంబాబు,అరెగంటి నాగరాజు,అంకిల్ల శంకర్ మట్టెడ కుమార్ దీక్షలోఉన్నారు. ఈ శిబిరంలో కేయూ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రవీందర్, బాధ్యులు సుధాకర్, ఎం సారంగపాణి గాయపడిన విద్యార్థులను పరామర్శించారు.

# విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్ యూఈఈయూ గౌరవాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి


దీక్షలు ప్రారంభిస్తున్న టీఎస్ యూఈఈయూ జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ హనుమకొండ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట యూఈఈయూ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ప్రభాకర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న 1,690మంది అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్‌లుగా సంస్థలోకి విలీనం చేసుకోవాలన్నారు. వీరికి కనీసం వేతనం ఇవ్వాలన్నారు. ఆర్టిజన్‌ల సమస్యలు పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. పీస్ రేట్ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని సంస్థలోకి తీసుకుని న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూఈఈయూ డిస్కం ఉపాధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, ప్రభాకర్, అబ్బోజీ పూర్ణాచారి, ఎ.ప్రవీణ్, టి.రామకృష్ణ, బి.వెంకన్న, ఎండీ అన్వర్, ఇ.రమేష్, ఎండీ.వాజీద్, బి.రమేష్, జి.రాజేష్, రంగనాథస్వామి, ఎండీ రఫీ, బి.మొగిళి పాల్గొన్నారు.